కదం తొక్కిన కార్మిక సంఘాలు

- సార్వత్రిక సమ్మె సక్సెస్
- మానవహారాలు, ర్యాలీల నిర్వహణ


ఆమనగల్లు : మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు



చేవెళ్ల : ర్యాలీలో కార్మిక సంఘాల నాయకులు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా జిల్లాలో కార్మిక సంఘాలు బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. సీఐటీయూ, ఏఐటీయూసీ, టీడబ్ల్యుజేఎఫ్, టీఎన్‌టీయూసీ, ఎఫ్‌టీయూ, అనుబంధ సంఘాల కార్మికులు రోడ్లపైకి వచ్చి ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కదం తొక్కారు. సమ్మెకు వివిధ రాజకీయ పార్టీలు, సంఘాల నేతలు మద్దతు తెలిపారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం తక్షణమే ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో సీపీఐ, సీపీఎం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై, ఆమనగల్లులో సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. ఆమనగల్లులో రాజీవ్ చౌక్‌వద్ద మానవహారం చేపట్టారు. ఇబ్రహీంపట్నంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నాగార్జునసాగర్ రహదారిపై ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సమ్మెకు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. షాద్‌నగర్, కొత్తూర్ చౌరస్తాలో జెండాలు చేతబట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కొత్తూర్ నుంచి షాద్‌నగర్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. మహేశ్వరంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీల ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారిపై కొత్తగూడ చౌరస్తా వరకు భారీ ర్యాలీలు, మానవహారం నిర్వహించారు.

రంగారెడ్డి అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి)


లాటరీ తీస్తున్న సీఈవో, ఆర్డీవోలు

ఫార్మా బాధితులకు ప్లాట్ల కేటాయింపు

581 మందికి ఇంటి స్థలాల పంపిణీ

కందుకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలంలోని మీర్కాన్‌పేట, పంజగూడ, తిమ్మాయిపల్లి రెవెన్యూ పరిధిలో డెవలప్ చేసిన లేఅవుట్‌లోని ప్లాట్లను లాటరీ ద్వారా 581 మంది ఫార్మా భూ నిర్వాసితులకు కేటాయించారు. బుధవారం మీర్కాన్‌పేటలోని ఏటీసీ కేంద్రంలో లాటరీ ప్రక్రియను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి హాజరై లాటరీ తీసి లబ్ధిదారులకు ప్లాట్లను కేటాయించారు. రెండు రోజుల పాటు ఎకరంలోపు లబ్ధిదారులకు 60, 121 గజాల చొప్పున ఇంటి స్థలాలను 1821మందికి కేటాయించగా, బుధవారం ఎకరంన్నర భూమి ఇచ్చిన రైతులకు 181గజాల చొప్పున 581మందికి ప్లాట్లను అందజేశారు. కాగా 581మంది రైతులకు గాను 241మంది రైతులు లాటరీ కార్యక్రమానికి హాజరుకాలేదని అధికారులు తెలిపారు. గురువారం 242మంది రైతులకు 242, 302 గజాలకు స్థలాలను కేటాయించేందుకు లాటరీ ప్రక్రియ ఉదయం 8గంటల నుంచి నిర్వహిస్తామని చెప్పారు. డీపీఓ సురేశ్‌మోహన్, కందుకూరు, యాచారం మండలాల తహసీల్దార్లు కె.గోపాల్, అయ్యప్ప, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు, మహేశ్వరం ఉప సబ్‌రిజిస్ట్రార్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారంపై పంచాయితీ!

ఎన్కేపల్లిలో వివాదాస్పదంగా గోశాల నిర్మాణం

మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన గోశాల నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను అక్రమంగా తీసుకోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిహారం విషయం తేల్చకుండా భూమి పూజ ఎలా చేస్తారని మూడు రోజులుగా ఆందోళనలు చేపడుతున్నారు. గోశాల నిర్మించే ప్రాంతంలో రాత్రి పగలు వంటావార్పు, జాగారం చేస్తూ నిరసన తెలుపుతున్నారు.

- అక్రమ భూసేకరణపై బాధిత రైతుల ఆందోళన
- భూములు కోల్పోతున్న 50 రైతు కుటుంబాలు
- న్యాయం చేయాలని ప్రభుత్వానికి వేడుకోలు
- గోశాల నిర్మించే ప్రాంతంలో వంటావార్పు
- 300 కాదు 500 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్

రంగారెడ్డి అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పరిహారం ప్రకటించకుండానే మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలోని ప్రభుత్వ భూమిలో గోశాల నిర్మాణ పనులు చేపట్టడంపై రైతులు, అధికారులకు మధ్య వార్ కొనసాగుతోంది. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం తీసుకోవడంపై ఉద్రిక్తతకు దారి తీసింది. ఎకరా భూమి కోల్పోతున్న రైతులకు 300 గజాల చొప్పున స్థలాన్ని ఇస్తామని ప్రభుత్వం ప్రకటించగా, 500 గజాలు ఇవ్వాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. పరిహార పంచాయితీ రోజురోజుకూ ముదురుతోంది. మూడు రోజులుగా బాధిత రైతులు గోశాల నిర్మాణం జరుగుతున్న స్థలం వద్ద రాత్రంతా మకాం వేసి.. వంటావార్పు చేస్తూ నిరసన తెలుపుతున్నారు. పరిహారం విషయం తేల్చనిదే భూములు

మిగతా 8వ పేజీలో...


బాధిత రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి (ఫైల్)

రైతులకు మద్దతుగా ప్రతిపక్ష నేతలు

ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటు కారణంగా భూములు కోల్పోతున్న బాధిత రైతులకు ప్రతిపక్ష నేతలు అండగా నిలిచారు. మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు బీఆర్ఎస్ నేతలు భూ బాధితుల తరఫున ఆందోళన చేపడుతున్నారు. ఇప్పటికే సబితారెడ్డి రైతుల పక్షాన ఆందోళన చేపట్టారు. రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తిలేదని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తామన్నారు.


గోశాల నిర్మాణ స్థలం వద్ద వంటావార్పు

రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం..



రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్కేపల్లి రైతులకు అన్యాయం చేస్తుంది. గోశాల నిర్మాణం కోసం ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న భూములను అక్రమంగా లాక్కుంటుంది. రైతులకు మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలి. లేదా భూమికి భూమి ఇవ్వాలి. రైతుల పొట్టకొట్టొద్దు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

పట్లోళ్ల కృష్ణారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్

పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారు



మాకు ఇష్టం లేకున్నా వ్యవసాయం చేసుకునే పొలాలను లాక్కున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే పోలీసులతో భయపెట్టిస్తున్నారు. మాపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. మా భూములు ఎలా లాక్కుంటారని ప్రశ్నించిన పాపానికి నాపై పోలీసులు దాడి చేసి గాయపర్చారు. ఇది మంచి పద్ధతి కాదు. రైతుల ఉసురుతగిలి నాశనమై పోతారు.

బిచ్చం గంగమ్మ, బాధిత రైతు, ఎన్కేపల్లి


ఎమ్మెల్యే వీర్లపల్లికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

మా భూములు ఇప్పించండి

ఎమ్మెల్యేకు టెక్స్‌టైల్ పార్కు బాధితుల వినతి

షాద్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామంటూ తమ వద్ద భూములను కొనుగోలు చేసి 23ఏళ్లు గడస్తున్నా నేటికీ పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని, తిరిగి వాటిని ఇప్పించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను రైతులు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నందిగామ మండలం చేగూరు, నర్సప్పగూడ గ్రామాలకు చెందిన రైతులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2002లో కొందరు వ్యక్తులు చేగూరు, నర్సప్పగూడ గ్రామాల పరిధిలో హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పరిశ్రమ పేరిట సొసైటీని ఏర్పాటు చేశారని తెలిపారు. రైతుల నుంచి 142 ఎకరాల స్థలాన్ని అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. నేటికీ పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. ఈ భూములను గత ప్రభుత్వ పెద్దల్లో కీలకంగా ఉన్న ఒక మహిళా రాజకీయ నాయకురాలి బంధువులకు భూములను విక్రయిస్తున్నారని రైతులు ఆరోపించారు. అప్పుడు ఎకరా స్థలం రూ.70వేల నుంచి రూ.80వేలకే తీసుకున్నారని, ప్రస్తుతం ఎకరా ధర రూ.6కోట్లకు పైగా పలుకుతుందన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... హైదరాబాద్ హైటెక్ టెక్స్‌టైల్ పార్కు భూముల కొనుగోలు వ్యవహారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు.

మాడ్గులకు రేపు మంత్రుల రాక

ఆమనగల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండలంలో ఈనెల 11న మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నట్లు పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, మాడ్గుల మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూ.87.70 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. మాడ్గుల మండల కేంద్రంలో రూ.12.70 కోట్లతో నూతనంగా నిర్మించే 30 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి, ఆమనగల్లు మండలం కోనాపూర్ నుంచి మాడ్గుల వరకు రూ.45 కోట్లతో చేపట్టే బీటీ డబుల్ రోడ్డు విస్తరణ పనుల నిర్మాణానికి, మాడ్గుల నుంచి అందుగుల గేటు వరకు రూ.30 కోట్లతో చేపట్టే రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అలాగే 220 మందికి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు.

మందపై కుక్కల దాడి.. 25 గొర్రెలు మృతి

రెండున్నర లక్షల రూపాయలు నష్టం.. లబోదిబోమంటున్న కాపరి


మృతి చెందిన గొర్రెల వద్ద రైతు కృష్ణయ్య

కేశంపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతిచెందిన సంఘటన కేశంపేట మండలం తూర్పు చౌలపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎలిగపల్లి కృష్ణయ్య తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న పాకలో రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి తన గొర్రెలను ఉంచి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున పాక దగ్గరికి వెళ్లి చూడగా తీవ్రంగా గాయపడి 25 గొర్రెలు చనిపోయినట్లు గుర్తించాడు. మరి కొన్ని జీవాలు గాయపడ్డాయి. చనిపోయిన గొర్రెల విలువ దాదాపు రెండున్నర లక్షల రూపాయలు ఉంటుందని బాధితుడు బోరుమన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

కోళ్లఫాం వల్లనే కుక్కల దాడి

గ్రామ శివారులోని కోళ్లఫాంలో చనిపోయిన కోళ్లను ఆరుబయట పడేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇలా వాటిని తింటున్న కుక్కలు మాంసానికి అలవాటు పడ్డాయని, దీంతో లేగ దూడలు, గొర్రెలు, మేకలు, ఒంటరి మహిళలపై దాడులు చేస్తున్నాయని చెప్పారు. కోళ్లఫాం యజమానులు చనిపోయిన కోళ్లను ఆరుబయట పడేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గొర్రెల కాపరికి పరామర్శ

గొర్రెలు మృత్యువాత పడిన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య గొర్రెల కాపరిని పరామర్శించారు. బాధితుడికి పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షురాలు రొల్లు రాధిక, నాయకులు పసుపుల ప్రశాంత్, రొల్లు రాఘురాములు గౌడ్, పద్మకృష్ణయ్య, రమేష్ గౌడ్, పాండురంగారెడ్డి, నర్సింలు, రెడ్యా నాయక్, నర్సింహులు, శ్రీశైలం, వెంకటేష్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

యూరియా కొరత లేదు

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

రంగారెడ్డి అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వానాకాలం సీజన్‌కు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఏసీఎస్, ఏఆర్ఎస్‌కే, ప్రైవేట్ డీలర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, ముఖ్యమైన ప్రదేశాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలోని మార్క్‌ఫెడ్ గోదాముల్లో పీఏసీఎస్, ఏఆర్ఎస్‌కే, ప్రైవేట్ డీలర్ల వద్ద 5,700 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు చెప్పారు. డీఏపీ 1,204 టన్నులు, కాంప్లెక్స్ 5,446 టన్నులు, ఇతర ఎరువులు 500టన్నులు నిల్వ ఉన్నట్లు చెప్పారు. రైతులు అవసరం మేరకు ఎరువులు కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు.

ఎంపీటీసీల పునర్విభజన

షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం

- కసరత్తు ప్రారంభించిన అధికారులు
- అభ్యంతరాల స్వీకరణకు అవకాశం
- 12న తుది జాబితా విడుదల
- పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో తగ్గిన ఎంపీటీసీ స్థానాల సంఖ్య





రంగారెడ్డి అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీల సరిహద్దులపై ప్రభుత్వానికి నివేదిక పంపించిన అధికారులు వార్డులు ఖరారు చేశారు. తాజాగా మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీసీటీల) పునర్విభజనకు షెడ్యూల్‌ను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం అభ్యంతరాల స్వీకరణ ఉండగా అలాంటివేమీ రాలేదు. గురు, శుక్రవారాల్లో అభ్యంతరాలకు పరిష్కారానికి అవకాశం కల్పించారు. శుక్రవారం ఈనెల 12న తుది జాబితాను విడుదల చేయనున్నారు.

ప్రతీ మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలని నిర్ణయించడం, కొన్ని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడం వల్ల కొన్ని చోట్ల ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు చేర్పులు జరిగాయి. దీంతో జిల్లాలో ఎంపీటీసీ స్థానాల స్వరూపం మారింది. కొన్ని ఎంపీటీసీ స్థానాలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో

మిగతా 8వ పేజీలో...

కొమిరె రాంచంద్రయ్యకు డాక్టరేట్


పట్టా అందుకుంటున్న రాంచంద్రయ్య

పరిగి, జూలై 9(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం బసిరెడ్డిపల్లి వాసికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమిరె రాంచంద్రయ్యయాదవ్ ఓయూలో ఆర్థికశాస్త్ర విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థి. 'స్టాక్ మార్కెట్ ప్రవర్తన - భారత దేశ ఆర్థిక వృద్ధి' అనే అంశంపై ప్రొఫెసర్ నకులరెడ్డి పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు. భారతస్టాక్ మార్కెట్ మార్గదర్శకాలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధిపై చేసిన పరిశోధన పత్రాలను యూనివర్సిటీకి అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆర్ట్స్ కళాశాలలో ప్రొఫెసర్ నకులారెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

శంకర్‌పల్లి, జులై 9(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని, జాబితాను తప్పుల్లేకుండా జాగ్రత్త పడాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ సూచించారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు జాబితా తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రోరల్ ప్యూరిఫికేషన్, ఓటరు జాబితా తయారీ, సవరణ, ఫామ్-6, 7, 8లపై మాస్టర్ ట్రైనర్స్ ఆశీర్వాదం, బాలాజీ, రోషన్‌లు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఓటరు జాబితాలో కొత్త వారిని చేర్చడం, చనిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు. నియోజకవర్గ ట్రైనింగ్ ఇన్ చార్జి నర్సింహరావు, శంకర్‌పల్లి, చేవెళ్ల తహసీల్దార్లు సురేందర్, కృష్ణయ్య, శంకర్‌పల్లి డీటీ బాలకృష్ణారెడ్డి, ఎన్నికల సూపర్‌వైజర్ పాండు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రకళ


సమావేశంలో మాట్లాడుతున్న కాళ్ల జంగయ్య

దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలి

- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

ఆమనగల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు ఆసరా పింఛన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు. ఆమనగల్లులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, ఎమ్మెఎస్పీ జిల్లా స్థాయి సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ దివ్యాంగులకు, వృద్ధుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈనెల 21న దివ్యాంగుల, ఆసరా పింఛన్‌దారుల జిల్లా మహాసభను నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ్మా, ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్ మాదిగ, జంగయ్య, రావుగల్ల బాబు మాదిగ, మైసయ్య, ఉపాధ్యక్షులు రాములు, నర్సింహ్మా, రామచంద్రయ్య, కిరణ్‌ఫూలే, మండల అధ్యక్షులు శ్రీశైలం, శ్రీనివాస్, రమేశ్, నాయకులు భాస్కర్, సత్యనారాయణ గౌడ్, సాయిలు, డేరంగుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల బాధలు పట్టని ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ఆరోపించారు. రైతుల సమస్యలు పట్టించుకోకుండ మొద్దు నిద్ర పోతోందని మండిపడ్డారు. ఆమనగల్లు, వెల్దండ, మాడ్గుల మండలాలకు సాగునీటినందించే కేఎల్ఐ డీ-82 కాల్వను బుధవారం జూపల్లి వద్ద రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి జైపాల్‌యాదవ్ పరిశీలించారు. కాల్వవెంట నడుచుకుంటూ రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తిచేసి చివరి ఆయకట్టు మాడ్గుల మండలం నాగిళ్ల వరకు నిర్దీత 35వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాలని డిమాండ్ చేశారు. రవీందర్, విజయ్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, జగపతి, తిరుపతయ్య, శ్రీరాములు, వెంకట్, రియాజ్, భిక్షపతి, ప్రశాంత్, రామస్వామి పాల్గొన్నారు.


కేఎల్ఐ డీ-82 కాల్వను పరిశీలిస్తున్న జైపాల్ యాదవ్

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

మహేశ్వరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో ఐఎన్‌టీయూసీ పాత్ర కీకంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రెడ్డిగళ్ల అజయ్‌కి నియామక పత్రాన్ని బుధవారం తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక రకాల పరిశ్రమలున్నాయని, కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందుగా ఐఎన్‌టీయూసీ నాయకులే ముందుండాలన్నారు. దేప భాస్కర్‌రెడ్డి, కప్పాటి పాండురంగారెడ్డి, ఎ.ప్రశాంత్ రెడ్డి, శివ పాల్గొన్నారు.


అజయ్‌కి నియామకపత్రం అందిస్తున్న కేఎల్లార్


కొండా సురేఖకు ఆహ్వానపత్రిక అందిస్తున్న అర్చక సంఘం నాయకులు

మంత్రి కొండా సురేఖను కలిసిన అర్చకులు

కొడంగల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో ఈనెల 14, 15వ తేదీల్లో జరిగే పంచకుండాత్మక చండీకుబేర పాశుపతయాగానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు లక్ష్మీనర్సయ్యశర్మ, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థచారి, జోషి కిట్టుస్వామి, దత్తాత్రేయ రావు, తదితరులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

మహేందర్‌రెడ్డి మృతి బీజేపీకి తీరని లోటు

కోట్‌పల్లి, జులై 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు పట్లోళ్ల మహేందర్ రెడ్డి జూన్ 28వ తేదీన విద్యుత్ షాక్‌తో మృతి చెందడం బాధాకరమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బార్వాద్ గ్రామంలో ఆయన సంస్మరణ సభకు హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు శివరాజ్, సాదానంద్‌రెడ్డి, రమేష్ కుమార్, వడ్ల నందు, మాధవ రెడ్డి, మండల అధ్యక్షుడు శివకుమార్, రాంచంద్రరెడ్డి, వెంకటేష్‌యాదవ్, నరేందర్ రెడ్డి, కృష్ణయాదవ్, రాఘవేందర్‌గౌడ్ ఉన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో వన మహోత్సవం

శామీర్‌పేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు వన మహోత్సవం దోహదం చేస్తుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(జగద్గిరిగుట్ట) ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఇశ్రత్ అన్నారు. బుధవారం వన మహోత్సవంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ చేతన, అకాడమిక్ వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు. శామీర్‌పేటలో మున్సిపల్ సిబ్బందితో కలిసి అఫ్జల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అఫ్జల్‌ఖాన్ మొక్కలు నాటారు.


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, తదితరులు


ధర్నాకు దిగిన గ్రామస్తులు, బంధువులు

రవికాంత్ కుటుంబానికి న్యాయం చేయాలి

మాడ్గుల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో మంగళవారం మృతి చెందిన దుబ్బ రవికాంత్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. బుధవారం రోడ్డుపై బైటాయించి బంధువులు ధర్నాకు దిగారు. ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన బస్సులను మాడ్గులలో నిలిపివేశారు. డీఎం వచ్చి మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు సూదిని కొండల్‌రెడ్డిలు రవికాంత్ మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు.

రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు

మేడ్చల్ టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మార్కెట్ కమిటీ పరిధిలో రూ.14కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యదవ్ అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ అభివృద్ధికి ఈ నిధులు ఖర్చు చేస్తామని తెలిపారు. ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిలువ చేసే గిడ్డంగుల నిర్మాణంతోపాటు సీసీ రోడ్లు, స్వాగత తోరణం, మార్కెట్ కమిటీ కార్యాలయ నిర్వాహణకు ఖర్చు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్లు రాజు, శంకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్

వైభవంగా శోభాయాత్ర



గురుపౌర్ణమిని పురస్కరించుకొని తాండూరు - కోకట్ రోడ్డు మార్గంలోని షిర్డి సాయిబాబా ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం సాయిబాబా ఫొటోతో శోభాయాత్ర నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

- తాండూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి)

నాగసమందర్‌లో బోనాల సందడి

మండల పరిధిలోని నాగసమందర్ గ్రామంలో మంగళవారం గ్రామ దేవత పోచమ్మకు ఆషాఢ బోనాలను ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి చల్లంగా చూడాలని వేడుకున్నారు.

ధారూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి)



కబ్జా వాస్తవమే..

- జుంటువాగు కబ్జాపై కలెక్టర్ సీరియస్
- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సర్వే
- అక్రమ భవనం కూల్చివేతకు ఆదేశాలు

బషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్- తాండూరు మార్గంలోని జుంటువాగు కబ్జాపై కలెక్టర్ ప్రతీక్‌జైన్, తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సీరియస్‌గా స్పందించారు. కలెక్టర్ ఆదేశానుసారం యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, తాండూరు డివిజన్ ఇరిగేషన్ డీఈఈ కిష్టయ్య, ఏఈ భానుప్రకాష్‌రెడ్డి, ఆర్ఐ శివచరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, సిబ్బంది తదితరులు బుధవారం వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడున్న వ్యక్తి గోపాల్‌తో డ్యాకుమెంట్లను తెప్పించుకుని పరిశీలించారు. వాగుకు ఆనుకొని ఐదు మీటర్ల మేర 200 మీటర్ల పొడవునా మట్టి పోసి కబ్జాకు పాల్పడినట్లు తేల్చారు. చెక్‌డ్యాం వాగు వింగ్‌వాల్ సమీపం నుంచి కొలతలు తీయగా బఫర్‌జోన్ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ స్థలంలో అక్రమంగా రెండు గదులు నిర్మిస్తున్నట్లు బయట పడింది. అక్కడున్న వ్యక్తిని ఆరా తీయగా పదేళ్ల కిందట సర్వే 52, 53, 58లో 17.13 ఎకరాలు కొనుగోలు చేశామని, సర్వే చేశాకే గదులు నిర్మిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. వెంటనే అక్రమ నిర్మాణం కూల్చి వేయాలని తహసీల్దార్ ఆదేశించారు. అక్రమంగా నిర్మిస్తున్న గదులు సర్వే నంబరు 39:2లోని ప్రభుత్వ భూమి తాండూరు మండల పరిధిలోకి వస్తుండటంతో అక్కడి తహసీల్దార్ తారాసింగ్‌కు యాలాల తహసీల్దార్ వివరించారు. అనంతరం వాగు పక్కగుండా కబ్జా చేసిన ప్రాంతాన్ని అధికారులు సిబ్బందితో దగ్గరుండి సర్వే చేయించి హద్దులు గుర్తించారు. హద్దులు తొలగించినా, రెండు రోజుల్లో అక్రమ నిర్మాణం కూల్చి వేయకున్నా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.


జుంటువాగు ప్రాంతంలో మ్యాప్ ద్వారా కబ్జాను గుర్తిస్తున్న అధికారులు

మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

షాద్‌నగర్ అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో సీతక్కను ఆమె కార్యాలయంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం కొనసాగాలని మంత్రిని ఎమ్మెల్యే కోరినట్లు తెలిపారు.నెఎమ్మెల్యే వెంట రఘునాయక్, ఎస్టీ ఇబ్రహీంలు ఉన్నారు.


మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శంకర్

ఓటర్ల వివరాలను పరిశీలించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల వివరాలను పరిశీలించాలని అదనపు కలెక్టర్ సుధీర్ పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ మునిసిపల్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిస్ట్రిక్ట్ లెవెల్ మాస్టర్ ట్రైనర్, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి

- పరిశ్రమల హబ్‌గా చందన్‌వెళ్లి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చందన్‌వెళ్లి పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన జున్నా సోలార్ సిస్టమ్స్ లిమిటెడ్ మ్యానుఫాక్షరింగ్ యూనిట్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కంపెనీ యజమానులు శేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, బస్వీరెడ్డి, ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడారు. సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, జనార్దన్‌రెడ్డి, ఖాజామియా, శ్రీనివాస్‌గౌడ్, లింగం, పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.


సోలార్ ప్యానల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

పరిహారం తేల్చాకే ఇళ్లు కూల్చండి

తాండూరు రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు పనులకు సంబంధించి తమకు ఇళ్ల కూల్చివేతకు నష్ట పరిహారం తేల్చిన తర్వాతనే ఇళ్లను కూల్చాలని తాండూరు మండలం కోటబాస్పల్లి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామం మీదుగా చేపడుతున్న 167 జాతీయ రోడ్డు పనుల్లో పలువురి ఇళ్లు పూర్తిగా, పాక్షికంగా కూల్చివేసే పరిస్థితులు ఉన్నాయని వాపోయారు. కూల్చివేస్తున్న ఇళ్లకు నష్ట పరిహారం నిర్ణయించి ప్రకటించాలన్నారు.గురుచరణ్‌రెడ్డి, చంద్రారెడ్డి, మొగులప్ప, శేఖర్‌గౌడ్, నాగార్జున, భాస్కర్, కుర్వ మల్కప్ప, వడ్డె బాల్‌రాజ్, అశోక్‌గౌడ్, నిజాశ్రీహరి, కుర్వ భీమమ్మ, కళావతి పాల్గొన్నారు.

భద్రాచలం ఈవోపై దాడి సరికాదు

కీసర, జూలై 9(ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఈవోపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కీసరగుట్ట ఆలయ సిబ్బంది బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాల మేరకు దేవుడి మాన్యం స్వాధీనం చేసుకునేందుకు వెళ్లిన ఆలయ ఈవో రమాదేవిపై మంగళవారం భూకబ్జాదారులు చేసిన దాడిని ఆలయ సిబ్బంది ఖండించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితుడు మూర్తి సత్యనారాయణ శర్మ, ప్రధాన అర్చకుడు బలరాం శర్మ, ఉప ప్రధాన అర్చకుడు రవికూమార్ శర్మ, సిబ్బంది భాను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, జూలై9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో విద్యార్థి తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దాతల సహకారంతో పలకలు, ఐడీకార్డులు, టై, బెల్టులు, బూట్లు, బ్యాగులు, పాఠశాలకు సీసీ కెమెరాలు, పరేడ్ డ్రమ్స్‌ను అందించారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్, ఎంఈవోలు హరిలాల్, రామ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, వక్త భాస్కరయోగి, సీఐ శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, గౌరారం గోపాల్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యస్థాపనే లక్ష్యం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్య స్థాపనే ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిపల్లిగూడ, మాధారం, అంకుశాపూర్, అవుశాపూర్‌లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని, బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, నాయకులు కవాడి మాదవరెడ్డి, కందకట్ల సందీప్‌రెడ్డి, మేడబోయి జంగయ్య, కవాడి వామన్‌రెడ్డి, ముత్యాల్ యాదవ్, ముల్లి జంగయ్య, సత్తిరెడ్డి, చిన్నాయాదవ్ పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్

సమోసాలో బల్లి!

మొయినాబాద్,జూలై 9(ఆంధ్రజ్యోతి): ఓ స్వీట్ షాపులో కొనుగోలు చేసిన సమోసాలో బల్లి కనిపించింది. దాంతో కస్టమర్ అవాక్కయ్యాడు. చేవెళ్ల మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట స్టేజీ సమీపంలోని ఓ స్వీట్‌షాప్‌లో రెండు సమోసాలు కొనుగోలు చేసి తనతో పాటు వచ్చిన పాపకు ఒకటి ఇచ్చి తానూ ఒకటి తినేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో పాప వద్ద ఉన్న సమోసాలో బల్లి కనిపించింది. దాంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. పాప తండ్రి ఈ విషయమై షాపులో ఉన్న వ్యక్తిని అడిగితే.. నన్నేం చేయమంటావ్.. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పాపను చేవెళ్ల ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆ పాప వాంతులు చేసుకున్నదని తెలిపారు. షాపు యజమానిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు.



లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

శంషాబాద్/చేవెళ్ల/చౌదరిగూడ, జూలై9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో వివిధ రంగాలకు చెందిన కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండు కూడలిలో బైటాయించి కొద్దిసేపు నిరసన తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు ఆర్.యాదగిరి అన్నెపు ప్రభు, నర్సింహరెడ్డి సక్రూ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం తక్షణమే ఆపాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కాడిగళ్ల భాస్కర్ డిమాండ్ చేశారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో సీపీఐ, సీపీఎం నాయకులతో పాటు వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల చట్టాలను కాలరాస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు మగ్బూల్, సీపీఎం డివిజన్ కార్యదర్శి దేవేందర్, జిల్లా కోశాధికారి లక్ష్మి, పాల్గొన్నారు. ప్రజా సమస్యలపై కార్మిక సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రం నుంచి, కొందుర్గు మండల కేంద్రం వరకు సీపీఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నాయకులు కృష్ణ, ఆకాశ్‌నాయక్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ : ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు


చౌదరిగూడ : బైక్ ర్యాలీలో కార్మిక సంఘం నాయకులు

వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలి

వికారాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీవో నంబర్లు 81, 85 ప్రకారం వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్‌ఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు పూజారి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం వీఆర్‌ఏ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వంగూరి రాములు పిలుపు మేరకు వీఆర్‌ఏ వారసులు, నాయకులు ర్యాలీ నిర్వహించి వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు పే స్కేలు, వారసులకు ఉద్యోగ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికే 16,758 మందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసినా మిగిలిన 3,797 మంది వారసుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏ జేఏసీ నాయకులు

రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద...

రంగారెడ్డి అర్బన్ : జీవో నంబర్ 81, 85 ప్రకారం వీఆర్‌ఏ వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, గ్రామ పరిపాలనా అధికారి(జీపీవో) నియామకాల్లో ప్రాధాన్యమివ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ వారసులు కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

రిసార్ట్స్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

వికారాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ది వైల్డర్ నెస్ రిసార్ట్స్‌లో ఇద్దరు మహిళా పర్యాటకులు మృతి చెందిన ఘటనపై రిసార్ట్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిట్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత గీత డిమాండ్ చేశారు. బుధవారం వైల్డర్ నెస్ రిసార్ట్స్ పరిసరాలను సందర్శించారు. రిసార్ట్స్ నిర్వాహకులు ఎవరినీ లోపలికి రానించక పోవడంతో వారి తీరుపై మండి పడ్డారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి, మల్లేశ్, మాదారం వెంకటేశ్, పీర్ మహమ్మద్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారంపై పంచాయితీ!

(ఐదో పేజీ తరువాయి)


బాధిత రైతులకు మద్దతుగా ధర్నాలో మాజీ మంత్రి సబితారెడ్డి (ఫైల్)

ఇచ్చేది లేదని తేల్చి చెబుతున్నారు. భూమికి భూమి ఇవ్వాలి లేదా మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. షాబాద్ మండలం హైతాబాద్, సీతారాంపూర్ ప్రాంతాల్లో పరిశ్రమలకు భూసేకరణ చేపడితే ఎకరాకు రూ.12 లక్షలు, ఒక ప్లాట్‌ను ఇచ్చారు. అదే మాదిరిగా ఇవ్వాలని కోరుతున్నారు. పరిహారం కోసం ఉద్యమం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలోని సర్వే నెంబర్ 180లో ప్రభుత్వం 99.14 ఎకరాలను గోశాల నిర్మాణానికి కేటాయించింది. 70 ఏళ్ల నుంచి ఈ భూములనే నమ్ముకొని 50 కుటుంబాలకు పైగా జీవిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య గోశాల నిర్మాణానికి ఇటీవల భూమిపూజ చేశారు. ఆ సమయంలో పరిహారం ఇవ్వకుండా పనులు ఇలా ప్రారంభిస్తారని స్థానిక రైతులు ఆందోళనకు దిగారు. భూమి చదును పనులను అడ్డుకున్నారు. జూన్ 4న మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్ రైతులతో సమావేశమై చర్చలు జరిపారు. ఎకరాకు 250 గజాల స్థలం ఇస్తామని చెప్పారు. ఇందుకు రైతులు నిరాకరించారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారంతో పాటు కనీసం వెయ్యి గజాల స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిహారం ఇవ్వడం సాధ్యం కాకుంటే ఎకరానికి వెయ్యి గజాల స్థలం, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని జూన్ 20న ఎమ్మెల్యే కాలె యాదయ్య, కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. 250 గజాలకు మించి ఇవ్వలేమని అధికారులు తేల్చిచెప్పడంతో రైతులు కన్నెర్ర చేశారు. ఆ భూమి జోలికి వస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. దీంతో గోశాల భూమి వద్ద పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి జూన్ 5న హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు సర్వే పూర్తి చేశారు. రైతులు అక్కడికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. జూలై 7న గోశాల నిర్మాణానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య భూమి పూజ చేశారు. అప్పుడు కూడా రైతులు ఆందోళనకు దిగడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంతేకాకుండా మూడు రోజులుగా గోశాల నిర్మించే స్థలం వద్ద వంటావార్పు చేసుకుని జాగారం చేస్తున్నారు. న్యాయం జరిగేంత వరకు ఇక్కడ నుంచి కదిలే ప్రసక్తిలేదని తేల్చిచెబుతున్నారు. ఎకరా కోల్పోతున్న బాధిత రైతుకు 300 గజాల ప్లాట్ ఇస్తామని అధికారులు చెబుతున్నారు.. కానీ.. 500 గజాలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనికి తోడు ఎకరాకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. రైతులు, అధికారులకు మధ్య ఈ పంచాయితీ ఎడతెగటం లేదు.

భూ బాధితులకు అండగా బీఆర్ఎస్

మొయినాబాద్ రూరల్ : ఎన్కేపల్లి భూ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, మండలాధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డిలు అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధి ఎన్కేపల్లిలోని సర్వే నంబర్ 180లో 99ఎకరాల 14గుంటల భూమిలో రాష్ట్ర ప్రభుత్వం గోశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఆ స్థలంలో ఎన్కేపల్లికి చెందిన రైతులు వ్యవసాయం చేసుకుంటుండగా ప్రభుత్వ నిర్ణయంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. వారికి అండగా మొయినాబాద్ దారెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్కేపల్లిలోని ప్రభుత్వ స్థలం వద్దకు బుధవారం వెళ్లి బాధిత రైతులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయానికి పనికిరాని అనేక ప్రభుత్వ స్థలాలున్నాయని, వాటిని వదిలేసి వ్యవసాయానికి పనికి వచ్చే ఈ భూములను ప్రభుత్వం గోశాల పేరిట లాక్కోవడం మంచి నిర్ణయం కాదన్నారు. కార్యక్రమంలో శ్రీహరియాదవ్, పరమేష్, మోత్కుపల్లి సునీల్, షాబాద్ ప్రవీన్, తదితరులున్నారు. అలాగే బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎన్కేపల్లి రైతులకు మద్దతు తెలిపారు. చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీపతి యాదవ్, తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

భూమికి భూమి ఇవ్వాలి



బండరాళ్లు, రప్పలు, చెట్లపొదలను తీసేసి తాతల కాలం నుంచి ఈ భూములను సాగు చేసుకుని జీవిస్తున్నాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని తీసుకోవడం సరికాదు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే మాకు కన్నీళ్లను మిగుల్చుతుంది మా బతుకులను రోడ్డున పడేస్తుంది. భూమికి భూమి ఇవ్వాలి. లేదా మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి.

- డప్పు రమేష్, ఎన్కేపల్లి భూ బాధితుడు

మేం ఊరుకోం.. పోరాటం చేస్తాం



దాదాపు 70 ఏళ్ల నుంచి మా తాతల నుంచి ఈ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాం. 1954లో దళితులకు ఇక్కడే 30ఎకరాలు అప్పటి ప్రభుత్వంలోని అదనపుకలెక్టర్ అసైన్డ్ అని రాసి ఇచ్చాడు. ఇప్పుడు గోశాల నిర్మాణం పేరిట ఉన్న భూమిని లాక్కుంటే ఎలా బతకాలి. ప్రభుత్వం మాకు అన్యాయం చేస్తుంది. ఊరుకునేది లేదు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

- నడికూడ సికిందర్, ఎన్కేవల్లి భూ బాధితుడు

సార్వత్రిక సమ్మె విజయవంతం


ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలో కార్మికుల మానవహారం


మంచాల : సమ్మెలో కార్మికులు



యాచారం : ర్యాలీలో సీపీఎం నాయకులు, కార్మికులు తదితరులు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా చేపట్టిన దేశవ్యాప్త సమ్మె విజయవంతమైంది. ఈమేరకు బుధవారం జిల్లాలో సీఐటీయూ, ఏఐటీయూసీ, టీడబ్ల్యూజేఎఫ్, టీఎన్‌టీయూసీ, తదితర యూనియన్లు అనుబంధ సంఘాల నుంచి వందలాది కార్మికులు రోడ్లపైకి వచ్చి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారులపై భారీ ర్యాలీలు నిర్వహించారు. సమ్మెకు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.


కందుకూరు : హైదరాబాద్-శ్రీశైలం హైవేపై ర్యాలీలో సీపీఎం, సీఐటీయూ నాయకులు, కార్మికులు



షాద్‌నగర్ : ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు తదితరులు



మహేశ్వరం : ర్యాలీలో నాయకులు, కార్మికులు


కొత్తూర్ : నినాదాలు చేస్తున్న నాయకులు



తలకొండపల్లి : ప్రధాన రహదారిపై బైటాయించి నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం


కందుకూరు : హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్‌పై ఏబీవీపీ నాయకులు, విద్యార్థుల ర్యాలీ

కొత్తూర్/ఆమనగల్లు/కడ్తాల/తలకొండపల్లి/కందుకూరు/ఇబ్రహీంపట్నం/చేవెళ్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో ఏబీవీపీ నాయకులు జెండాను ఆవిష్కరించారు. మండల కన్వీనర్ నరేష్‌చారి, హర్ష యాదవ్, జుగేష్ శశికాంత్, అరవింద్, శ్రీకాంత్, తదితరులున్నారు. ఆమనగల్లు పట్టణంలో ఏబీవీపీ నగర కార్యదర్శి పురుగుల శివ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండాలు చేబూని విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. లండం మల్లేష్, గోరటి భరత్, కొట్ర సురేశ్, మల్లేశ్, అంజి, సుమన్, విద్యార్థులున్నారు.

కడ్తాల మండల కేంద్రంలో ఏబీవీపీ నగర కార్యదర్శి నేనావత్ పవన్ జెండాను ఆవిష్కరించారు. శ్రీకాంత్, అర్జున్, తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో నగర కార్యదర్శి పుట్ట భరత్ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహం వద్ద జెండాను ఆవిష్కరించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. విజయ్‌కుమార్, వెంకటేష్, గిరి, రఘు, గణేశ్, తదితరులున్నారు. ఏబీవీపీ మహేశ్వరం కండాకార్యవహ జటావత్ లక్ష్మణ్, నగర కార్యదర్శి భానుప్రసాద్ ఆధ్వర్యంలో కందుకూరులో ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో కలిసి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి, ఏబీవీపీ జెండాను ఎగురవేశారు. ఏబీవీపీ వీరపట్నం జిల్లా హాస్టల్ కన్వీనర్ జ్యోతిప్రసాద్, కందుకూరు జాయింట్ కార్యదర్శి అమరేందర్, నాయకులు వినయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు. విద్యారంగ సమస్యలపై పోరు సల్పుతూనే సామాజిక కార్యక్రమాల్లో ఏబీవీపీ ముందుందని శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ అన్నారు. ఈమేరకు ఇబ్రహీంపట్నంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ ఇబ్రహీంపట్నం కన్వీనర్ శివకృష్ణ, జగదీశ్ పటేల్, గుణవంత్‌రెడ్డి, పవన్, మహేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. దేశం కోసం ధర్మం కోసం నిరంతరం ఏబీవీపీ కార్యకర్తలు పోరాటం చేస్తారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ షైపాల్, నగర అధ్యక్షుడు శ్రీశైలం తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఏబీవీపీ నాయకులు జాతీయ జెండాను ఎగరవేశారు. నితీష్, మల్లేష్, శ్రీకాంత్, రాజేశ్, కిషోర్, అనిల్, ఆకాశ్, వెంకటేశ్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.


కొత్తూర్ : జెండావిష్కరణలో ఏబీవీపీ నాయకులు

నియోజకవర్గ అభివృద్ధికి రూ.1.20 కోట్లు

షాద్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ అసెంబ్లీ పరిధిలో వివిధ అభివృద్ధి పనుకులగాను రూ.1.20 కోట్ల నిధులు మంజురయ్యాయని ఏఎంసీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్ తెలిపారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ కింద మంజురైన నిధులతో చౌదరిగూడ మండలం రావిర్యాల ప్రాథమిక పాఠశాలలో రూ.30 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు జగ్గిరెడ్డిగూడ నుంచి ఘణాపూర్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం, కేశంపేట మండలానికి మంజూరైన రూ.20లక్షలతో రహదారుల నిర్మాణం, ఈద్గా రోడ్డుకు మరమ్మతులు, ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడలో రూ.15లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పలుగ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను కూడా పూర్తి చేయడానికి ఈ నిధులు ఉపయోగపడతాయని చెప్పారు. షాద్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే శంకర్ నిరంతర కృషి చేస్తున్నారన్నారు. బాలరాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, రఘునాయక్, ఇబ్రహీం, బస్వం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి జయంత్‌ను కలిసిన శ్రీవర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. బుధవారం ఢిల్లీలోని మంత్రి చాంబర్‌లో కలిసి తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి, తదితర విషయాలను చర్చించినట్లు శ్రీవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యం

కేశంపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలతో సహా వివాహిత అదృశ్యమైన సంఘటన లేమామిడి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం దోనూర్ గ్రామానికి చెందిన శివలింగం భార్యా పిల్లలతో కలిసి కేశంపేట మండలం లేమామిడి గ్రామ సమీపంలోని కోళ్ల ఫాంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో శివలింగం భార్య దీపికకు గత మంగళవారం ఫోన్ రావడంతో మాట్లాడుతుండగా.. మధ్యలో కల్పించుకొని ఎవరితో మాట్లాడుతున్నావని అడిగాడు. దాంతో దీపిక సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహానికి గురైన శివలింగం ఆమెపై చేయిచేసుకున్నాడు. దాంతో తన ఇద్దరు పిల్లలు పాప(5) బాబు (7)తో కలిసి దీపిక బయటకు వెళ్లిపోయింది. శివలింగం తెలిసిన చోటల్లా వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

సంక్షిప్తంగా..

షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలం చించోడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జాతీయ మానవ హక్కులు, నేర నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్ టీచర్లున్నారు.

ఆమనగల్లు : మొక్కల పెంపకం విద్యార్థులు సామాజిక బాధ్యతగా గుర్తెరిగి ఉద్యమస్ఫూర్తితో నాటి సంరక్షించాలని ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు పిలుపునిచ్చారు. కళాశాల ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు.

మహేశ్వరం : బీసీ బిల్లు సాధన కోసం తెలంగాణలోని అన్ని బీసీ సంఘాలు మద్దతు పలకడం అభినందనీయమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్నాటి నరేష్ తెలిపారు. బీసీ బిల్లు సాధన కోసం ఈ నెల 17న కవిత నిర్వహించతలపెట్టిన రైల్ రోకో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నగరంలోని కవిత నివాసంలో ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు.

చేవెళ్ల : మండల పరిధిలోని ఆలూర్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడటంతో మాజీ సర్పంచ్ విజయలక్ష్మీ నర్సింలు ఆధ్వర్యంలో మూడు కిలోమీటర్ల దూరం వరకు గుంతలను జేసీబీతో పూడ్చివేయించే పనులు చేయించారు. ఆలూర్ ప్రజాప్రతినిధులు నర్సింలు, వెంకటేష్, రాజు, చేవెళ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదిరెడ్డి తదితరులు గుంతల్లో మట్టివేసి పూడ్చివేశారు. ఆర్ అండ్‌బీ ద్వారా రోడ్డు మంజూరై మూడు సంవత్సరాలు గడిచిన అధికారులు, మండల ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని డిమాండ్ చేశారు.

శంకర్‌పల్లి : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని ఫత్తేపూర్ బ్రిడ్జి నుంచి కంది వైపు వెళ్లే రోడ్డు, తీగల వద్ద గల రోడ్డులో గుంతలను కాంక్రీట్‌తో పూడ్చి వేయించారు.

షాద్‌నగర్ అర్బన్ : విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి బయలుదేరి షాద్‌నగర్‌కు చేరుకున్న విశ్వబ్రాహ్మణ సాంస్కృతిక చైతన్య యాత్రకు స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు ఘనస్వాగతం పలికారు. ఫరూఖ్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుని, స్థానిక ఎంపీడీవో ఆఫీసు ఎదుట ప్రొ. జయశంకర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కడప జిల్లా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి వారు బయలుదేరి వెళ్లారు.

కొత్తూర్ : మున్సిపాలిటీలోని స్టేషన్‌తిమ్మాపూర్ లోని పాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శివశంకర్‌గౌడ్ ప్లేట్లు, గ్లాసులు, వాటర్‌బాటిల్స్ అందజేశారు. ఎంఈవో అంగోర్‌నాయక్ ఆయన్ను అభినందించారు.

కేశంపేట : కేశంపేట మండలానికి డీఎంఎఫ్‌టీ నుంచి రూ. 33.30లక్షలు మంజూరయ్యాయని కాంగ్రెస్ మండ లాధ్యక్షుడు వీరేశ్ తెలిపారు. మండల కేంద్రంలో దివ్యాంగుల పునరావాస కేంద్రానికి రూ.20లక్షలు, నిర్దవెల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.13.30లక్షలు ఎమ్మెల్యే శంకర్ చొరవతో మంజూరు చేయించినట్లు తెలిపారు.

యాచారం : గంజాయి, డ్రగ్స్‌కు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి అన్నారు. మాదకద్రవ్యాలు వాడి తే కలిగే అనర్థాలపై మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించి పోస్టర్ విడుదల చేశారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడిన వారి సమాచారం అందించాలని చెప్పారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ లెక్చరర్లు ఉన్నారు.

ఆదిభట్ల : సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన కంటి సుధాకర్ గౌడ్‌కు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు కాగా.. ఈటల క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీపతిగౌడ్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

షాద్‌నగర్ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయికల్ టోల్ ప్లాజా సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. సుమారు 60-65 సంవత్సరాల వయస్సున్న మహిళను మంగళవారం రాత్రి 10.45 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొందని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి శరీరంపై పసుపు రంగు చీర, గులాబీ రంగు జాకెట్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు షాద్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాలిక కిడ్నాప్.. ఆచూకీ లభ్యం

- పిల్లలు లేరని అపహరించిన నిందితురాలు రజిని
- బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

శంషాబాద్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1న శంషాబాద్ కల్లు కాంపౌండ్‌లో కిడ్నాప్‌కు గురైన బాలిక కీర్తన(6) కేసును ఎట్టకేలకు ఆర్జీఐఏ పోలీసులు ఛేదించారు. బుధవారం సీఐ బాల్‌రాజ్ వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం, కంచన్‌పల్లికి చెందిన కె.లక్షమ్మ తన ఇద్దరు కూతుళ్లను తీసుకుని శంషాబాద్ రైల్వే కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగడానికి వచ్చింది. అదే కాంపౌండ్‌లో కల్లు తాగడానికి వచ్చిన శంషాబాద్‌లోని రాళ్లగూడలో నివాసముండే రంగాపూర్ రజిని(37) బాలికకు కల్లు తాగించి కిడ్నాప్ చేసి వికారాబాద్ జిల్లా ఎన్నేపల్లికి తీసుకెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి వెళ్లి బాలికను, నిందితురాలిను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఎందుకు కిడ్నాప్ చేశావని పోలీసులు విచారణ చేయగా.. తనకు పిల్లలు లేరనే కారణంగా బాలికను పెంచుకుందామని తీసుకెళ్లినట్లు రజిని చెప్పింది. ఈమేరకు బాలిక కీర్తనను పోలీసులు తండ్రి రమేష్‌కు అప్పగించారు. కేసును ఛేదించిన సిబ్బందిని సీఐ అభినందించారు.

ఎంపీటీసీల పునర్విభజన

(ఐదో పేజీ తరువాయి)

వీటి స్థానాలు తగ్గాయి. అలాగే పంచాయతీల పరిస్థితి కూడా ఇదే తరహాలోనే ఉంది. కొన్ని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో కలపడం ద్వారా వీటి సంఖ్య భారీగానే తగ్గింది. జిల్లాలో 257 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వీటిలో 27 స్థానాలు మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. ఔటర్ చుట్టూ ఉన్న గ్రామాలను మున్సిపాలిటీల్లో చేర్చడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 230కు చేరింది. ఆయా మండలాలు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందుతుండటంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గుతూ వస్తుంది. జిల్లాలో ఎనిమిది శాసనసభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 27 మండలాలు ఉండగా.. వీటిలో హయత్‌నగర్, సరూర్‌నగర్, బాలాపూర్, గండిపేట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి మండలాలను పూర్తిగా అర్బన్ మండలాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ అర్బన్ మండలాలన్నీ జీహెచ్ఎంసీ పరిధిలో భాగంగానే ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 21 గ్రామీణ మండలాలున్నాయి. వీటిలో 21 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి.

జిల్లాలో కొత్తగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీలో మొత్తం 12 పంచాయతీలు చేరాయి. అందులో చేవెళ్ల, కేసారం, మల్కాపూర్, ఇబ్రహీంపల్లి, రామన్నగూడ, దామరగిద్ద, ఊరెళ్ల, దేవునిఎర్రవల్లి, కందాడ, పల్గుట్ట, మల్లారెడ్డిగూడ, పామెన గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దీంతో కందాడ ఎంపీటీసీ స్థానం పోయింది. అల్లావాడ ఎంపీటీసీ పరిధిలోని పామెన గ్రామ పంచాయతీని చేవెళ్ల మున్సిపాలిటీలో విలీనం చేశారు. మిగిలిన అల్లాడను గుండాల ఎంపీటీసీలో కలిపేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. అదే విధంగా మొయినాబాద్ మున్సిపాలిటీ కొత్తగా రూపాంతరం చెందింది. ఈ మున్సిపాలిటీలోకి మొయినాబాద్, సురంగల్, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, చిలుకూరు, పెద్దమంగళారం, మూర్తూజగూడ, అప్పోజిగూడ, ఎనికేపల్లి, అప్పోజిగూడ పంచాయతీలు ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో నుంచి 27 పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. దీంతో పంచాయతీల సంఖ్య 531కి చేరింది. అలాగే 4,710 వార్డులున్నాయి. ఈ పంచాయతీలకు త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయి. అధికారులు కూడా ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో ఇంతకు ముందు 13 మున్సిపాలిటీలు, 3 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. కొత్తగా ఈసారి చేవెళ్ల, మొయినాబాద్ మండలాలు మున్సిపాలిటీలుగా మారాయి. దీంతో మున్సిపాలిటీల సంఖ్య 15కు చేరుకుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ సంఖ్య ప్రస్తుతం 18కి చేరుకుంది.


సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

మంచాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అవసరమైన యాంత్రిక పనిముట్లను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందని మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం రైతువేదికలో అన్నదాతలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.

త్వరలో అందుబాటులోకి కూరగాయల మార్కెట్

ఆరుట్ల కూరగాయల మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తెస్తామని పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీడీవో బాలశంకర్‌లు చెప్పారు. ఆరుట్ల పీఏసీఎస్ అవరణలో నిర్మాణంలో ఉన్న రైతుమార్కెట్ పనులను బుధవారం వారు పరిశీలించారు. హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రంగారెడ్డి చొరవతో ఇక్కడ మార్కెట్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో బాలశంకర్, డైరెక్టర్ వెంకటేష్, ఏఈవో సాయివాణి, కార్యదర్శి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మాదగోని జంగయ్యగౌడ్, దాసరమోని అశోక్, జిలమోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిభట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ జిల్లా నాయకులు తులసిగారి శేఖర్ అన్నారు. ఈమేరకు బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బడి గంటలకు అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లాలో చాలాచోట్ల ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమీప గ్రామాల నుంచి పాఠశాలలకు వెళుతున్నారని తెలిపారు. స్కూల్ సమయానికి బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో లాలయ్య, మహేష్, రవీందర్, భిక్షపతి, రాకేష్, రాము, సంజీవ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు అందజేత

కందుకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరిన్ని సేవలు అందించడానికి తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మోటి రమేష్ అన్నారు. సంస్థ ప్రతినిధులతో కలిసి కందుకూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఐడీ కార్డులను బుధవారం ఆయన అందజేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, కోశాధికారి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఐడీ కార్డులను అందజేసిన మోటి రమేష్